

ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్ సస్పెన్షన్

ప్రజాశక్తి - నరసాపురం


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఓ వివాదాస్పద భూమిని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారనే అభియోగంపై నరసాపురం ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ ఎంవిబి.ప్రసాద్‌ను ప్రభుత్వం సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. గుంటూరులో ఉన్న ఓ భూమిని నరసాపురంలో రిజిస్ట్రేషన్ చేసినట్లు చెబుతున్నారు. సదరు భూమికి అడంగల్ రికార్డులు లేకపోవడమే కాకుండా, కోర్టు వ్యవహారంలో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఫిర్యాదులు అందడంతో ప్రాథమిక దర్యాప్తు చేసిన ప్రభుత్వం ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ శాఖ పరంగా చర్యలు తీసుకుంది.

మహాసభకు వేళాయే..

నేటి నుంచి సిపిఎం ఏలూరు జిల్లా మహాసభ

ఎర్రజెండాలు, తోరణాలతో ముస్తాబైన మన్యం పురిటిగడ్డ బుట్టాయగూడెం

నేడు ప్రదర్శన, బహిరంగ సభ

14, 15 తేదీల్లో ప్రతినిధుల సభకు 200మందికిపైగా హాజరు

విచ్చేయనున్న రాష్ట్ర నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిపిఎం ఏలూరు జిల్లా 26వ మహాసభకు సర్వం సన్నద్ధమైంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న మహాసభకు జిల్లా నాయకత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మన్యం పురిటిగడ్డ బుట్టాయగూడెం ప్రాంతం మహాసభకు వేదికగా మారింది. మహాసభ నేపథ్యంలో బుట్టాయగూడెం మొత్తం ఎర్రజెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో ముస్తాబైంది. రోడ్లు, మహాసభ ప్రాంగణమంతా ఎరుపురంగు పులుముకుంది. మహాసభ జరగనున్న ప్రాంతానికి ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) నగర్‌గా నామకరణం చేశారు. మూడు రోజులపాటు జరగనున్న మహాసభలో తొలిరోజు శుక్రవారం ఉదయం 12 గంటలకు కన్నాపురం పెట్రోల్ బంక్ నుంచి సినిమా హాలు సెంటర్ వరకూ మూడు వేల మందితో భారీ ర్యాలీ, ఇటుక బట్టీ ప్రాంతంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. కొమ్ముడోలు నృత్యాలు, విల్లంబుల ప్రదర్శన, కళారూపాల ప్రదర్శన వంటి ప్రదర్శనలో ఆకర్షణీయంగా నిలవనున్నాయి. బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం ప్రసంగించనున్నారు. జిల్లా నలుమూలల నుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ ప్రదర్శన, బహిరంగసభలో పాల్గొనున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం తహశీల్దార్ కార్యాలయం రోడ్డు శివార్లలో ఏర్పాటు చేసిన ప్రాంగణంలో ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. జిల్లా నలుమూలల నుంచి మహాసభకు 200 మందికిపైగా ప్రతినిధులు హాజరు కానున్నారు. రెండో రోజు శనివారం ప్రారంభోపన్యాసం తర్వాత ప్రతినిధుల చర్చలు సాగనున్నాయి. మూడో రోజు ఆదివారం చర్చలు, ప్రజాసమస్యలపై తీర్మానాలతోపాటు నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరగనుంది. మహాసభను విజయవంతంగా నిర్వహించేందుకు గడిచిన కొద్దిరోజులుగా సిపిఎం జిల్లా నాయకత్వం విస్తృతంగా శ్రమించింది. తొలిరోజు బహిరంగ సభకు పెద్దఎత్తున జనం తరలిరావాలని జిల్లా నేతలు పిలుపునిచ్చారు. పండుగ వాతావరణంలో మహాసభ నిర్వహించేందుకు పార్టీ కేడర్ అంతా సమాయత్తమై ముందుకు సాగుతోంది.

ప్రధాన సమస్యలపై విస్తృత చర్చ..

మహాసభలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించనున్నారు. గడిచిన మూడేళ్లలో పార్టీ చేపట్టిన పోరాటాలు, అనుభవాలు, పేద రైతులు, గిరిజనులు, దళితులు వంటి అణగారిన తరగతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపైనా చర్చించనున్నారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలో ప్రజలపై విద్యుత్ భారాలు భారీగా మోపడం, హామీల అమలుపైనా సభలో చర్చలు సాగనున్నాయి. జిల్లా ప్రజానీకం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ఈ సభలో చర్చించనున్నారు. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో సర్వం కోల్పోతున్న నిర్వాసితుల సమస్యలపై సభలో చర్చించనున్నారు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా, ఇళ్ల నిర్మాణం చేయకుండా కాపర్ డ్యామ్ పూర్తి చేశారు. 2027 నాటికి పోలవరం ప్రధాన డ్యామ్‌తో సహా పనులన్నింటినీ పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికీ కుక్కునూరు, వేలేరుపాడు మండలంలోని 20 వేలకుపైగా కుటుంబాలకు పూర్తిస్థాయిలో పరిహారం అందించని పరిస్థితి నెలకొంది. కాపర్ డ్యామ్ నిర్మాణంతో ప్రతియేటా జులై, ఆగస్టు నెల్లో విరుచుకుపడుతున్న గోదావరి వరదలకు వేలేరుపాడు, కుక్కునూరు మండలంలోని గ్రామాలు ముంపుబారిన పడుతున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 50 అడుగులకు చేరకముందే దాదాపు 35కుపైగా గ్రామాల్లోకి వరద ముంపు చేరుతోంది. దీంతో అక్కడి ప్రజలు కొండలు, గుట్టలు, పునరావాస కేంద్రాల్లో నెలలు తరబడి తలదాచుకుంటూ నానావస్థలు పడుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ముందుగానే పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని సిపిఎం అలుపెరుగని పోరాటం చేస్తోంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరరావు పోలవరం నిర్వాసితుల సమస్యలపై పాదయాత్ర సైతం నిర్వహించారు. ఈ మహాసభలో నిర్వాసితుల సమస్యలన్నీ చర్చకు రానున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో ఎల్‌టిఆర్ భూముల వివాదం వంటి గిరిజనుల సమస్యలు చర్చించనున్నారు. జిల్లా రైతాంగం, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, భూసమస్యలతోపాటు ధరల భారంతో జనం పడుతున్న ఇబ్బందులు వంటి అనేక సమస్యలు మహసభలో కీలకంగా చర్చకు రానున్నాయి. ఆ సమస్యల పరిష్కారానికి మహాసభలో పలు తీర్మానాలు చేయనున్నారు.


జెండాలు కడుతున్న కార్యకర్తలు


బహిరంగ సభా ప్రాంగణంలో బోర్డులు సిద్ధం చేస్తున్న కార్యకర్తలు, నేతలు


విజయవాడలో రెండో రోజు గురువారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న ఏలూరు, భీమవరం కలెక్టర్లు వెట్రిసెల్వి, నాగరాణి

వైసిపికి గ్రంధి గుడ్‌బై

కార్యకర్తలను జగన్ పట్టించుకోవడం లేదని విమర్శ

సైకిల్ ఎక్కుతారని జోరుగా ప్రచారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం మాజీ ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ వైసిపికి గుడ్‌బై చెప్పారు. తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజీనామా లేఖను చూపారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వైవి.సుబ్బారెడ్డి, పలువురు జిల్లా నాయకులపై విమర్శలు ఎక్కుపెట్టారు. పార్టీ అధికారంలోకొచ్చాక రాష్ట్రాన్ని నాలుగు ముక్కలు చేసి నలుగురు నాయకులకు అప్పగించారన్నారు. రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ కలిగి, జనసేన అధినేతగా ఉన్న పవన్ కళ్యాణ్‌పై తాను గెలిచినప్పటికీ పార్టీలో తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. అయినప్పటికీ ఓర్పుగానే తాను పని చేశానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల కష్టాలను జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోవడం లేదని, గత నెల ఆరో తేదీన జగన్మోహన్‌రెడ్డిని కలిసిన సమయంలో తనపై ఐటి దాడులు జరిగాయని గుర్తు చేశారు. ప్రభుత్వంపై పోరుకు వచ్చే ఏడాది మే వరకూ వేచిచూడాలని తాను కోరానని, అయితే వెంటనే పోరాటం చేయాలని చెప్పారని అన్నారు. ఈలోపుగానే జిల్లాకు చెందిన కొంతమంది నాయకులు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తూ తనను చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజల అభిమానాన్ని దృష్టిలో పెట్టుకుని ఏ పార్టీలోకి వెళ్లాలనే దానిపై నిర్ణయం తీసుకుంటానన్నారు.


రాజీనామా పత్రాన్ని మీడియాకు చూపుతున్న గ్రంధి శ్రీనివాస్

వైసిపికి గడ్డు పరిస్థితి

వైసిపికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే గడ్డు పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రమైన ఏలూరులో ఇప్పటికే వైసిపి దాదాపుగా ఖాళీ అయ్యింది. మాజీ మంత్రి ఆళ్ల నాని, మేయర్ షేక్ నూర్జహాన్ దంపతులు, జెడ్‌పి ఛైర్మన్ గంటా పద్మశ్రీ దంపతులు వైసిపిని వీడి టిడిపి గూటికి చేరారు. ఈ క్రమంలో పశ్చిమగోదావరి జిల్లాలోనూ వైసిపి నుంచి వలసల పర్వం మొదలైంది. భీమవరం మాజీ ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ రెండు నెలల క్రితమే వైసిపిని వీడతారనే ప్రచారం జరిగినా తర్వాత ఐటి దాడులతో సస్పెన్స్ నెలకొంది. ఈ క్రమంలో ఆయన తాజాగా వైసిపికి గుడ్‌బై చెప్పనున్నట్లు ప్రకటించడం ఆ పార్టీ శ్రేణుల్లో కలకలం సృష్టించింది. ఇదే బాటలో మరో ఇద్దరు మాజీ ఎంఎల్‌ఎలు, కొందరు నేతలు సైతం వైసిపికి గుడ్‌బై చెప్పి టిడిపిలో చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు : కలెక్టర్

భీమవరం: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 13వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకూ నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని 20 మండలాల్లోని 320 రెవెన్యూ గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. భీమవరం డివిజన్‌లో 119, నరసాపురం డివిజన్‌లో 111, తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో 90 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. వీటిలో డివిజన్ల వారీగా భీమవరం 6, నరసాపురం 12, తాడేపల్లిగూడెం 7 రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం సదస్సులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో అర్జీదారుడిని గౌరవించి, ఆప్యాయంగా పలకరించి అర్జీని స్వీకరించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణ ద్వారా గ్రామాల్లో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చక్కటి అవకాశమన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించాలని, ప్రజా ప్రతినిధులను, రైతు సంఘాల నాయకులను ఆహ్వానించాలని అన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు తెలిపారు.

విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజలపై వేస్తున్న విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం రూరల్ దెయ్యాలతిప్ప గ్రామంలో గురువారం సిపిఎం ఆధ్వర్యంలో కరెంటు బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలపై వేస్తున్న విద్యుత్ సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఒడుగు నారాయణ, నాగిడి వెంకటేశ్వర్లు, రామాయణం కృష్ణమూర్తి, ఆంజనేయులు, దొర బురిడీ నరసింహమూర్తి, తిరుమల జల్లి రామ్మూర్తి, పితాని సుబ్బారావు పాల్గొన్నారు.

ఆకివీడు : పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక 14వ వార్డు మల్లులవారివీధిలో సిపిఎం నేత బి.కళ్యాణి, ఐద్వా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సందక ఉదయ కుమారి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బి.కళ్యాణి, సీనియర్ నాయకులు జివి.లావణ్య మాట్లాడుతూ సామాన్య ప్రజలపై అదనపు భారాలను మోపితే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. సందక ఉదయకుమారి మాట్లాడుతూ ప్రజలు వినియోగించింది కొంత అయితే బిల్లులు మాత్రం బారెడు వస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని లేనిపక్షంలో ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానికులు కె.యశోద, విజయ, బి.మంగ, పి.అమ్మడు, పి.నాగమణి, గేదెల రాము పాల్గొన్నారు.

ఇరగవరం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక భారం వేసిందని సిపిఎం ఇరగవరం మండల కన్వీనర్ కామన మునిస్వామి అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పేరుతో రూ.19 వేల కోట్లు ప్రజలపై ఆర్థిక భారాలు వేసిందని తెలిపారు. సెకీ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని మునిస్వామి డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు గుత్తుల రామాంజనేయులు, గబ్బల ముత్యాలు, జక్కంశెట్టి గంగాధర్, ఎం.ముసలయ్య పాల్గొన్నారు.


ఇరగవరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

యలమంచిలి : కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ అదనపు భారాలు వేయడం అన్యాయమని కాంబొట్లపాలెం మాజీ సర్పంచి, సిపిఎం సీనియర్ నాయకుడు పల్లి జార్జిబాబు అన్నారు. గుంపర్రు సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపి విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా జార్జి బాబు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలపై వేల కోట్ల భారాన్ని వేయడం సమంజసం కాదని తెలిపారు. వెంటనే ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంతర్వేది పద్మనాభ కుమార్, కె.సంపత్‌రావు, బి.త్రిమూర్తులు, సత్యనారాయణ, బి.వెంకన్న, ఎ.వినాయకుడు, యు.సూర్యనారాయణ పాల్గొన్నారు.

పాలకోడేరు : కూటమి ప్రభుత్వం ప్రజలపై వేసిన విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అశ్రియ్య డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలను నిరసిస్తూ పెన్నాడ అగ్రహారంలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అశ్రియ్య మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను అడ్డుగోలగా పెంచడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో ధనరాజు, ఆదిలక్ష్మి, వెంకన్న, కనకదుర్గ, నాని, షణ్ముఖ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పాలకొల్లు : ప్రజలపై అదనపు విద్యుత్ భారాలు వేయొద్దని సిపిఎం నాయకులు దిగుపాటి రాజగోపాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం సిపిఎం ఆధ్వర్యాన వార్డుల్లో నేతలు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే కరంటు బిల్లు పెంచబోమని చెప్పి ఈ రోజు 17 వేల కోట్ల రూపాయలు భారం వేయడం సరైంది కాదన్నారు. కరెంట్ బిల్లులు చూసి ప్రజలు షాక్‌కు గురవుతున్నారన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలని లేకుంటే సిపిఎం ప్రజా పోరాటాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు. మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో వై.అజయ్‌కుమార్, సత్తింశెట్టి పురుషోత్తం, చల్లా సోమేశ్వరరావు, గుబ్బల సత్యనారాయణ, యాకల్ రాము, నవీన్, పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు వినియోగంలోకి తేవాలి

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

అసంపూర్తిగా మిగిలి పోయిన ప్రభుత్వ భవన నిర్మాణాలను తక్షణం పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని రాష్ట్ర డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘు రామ కృష్ణంరాజు అధికారులను ఆదేశించారు. గొల్లలకోడేరులో గతంలో నిర్మించి అసంపూర్తిగా వదిలేసిన సచివాలయం, రైతుసేవా కేంద్రాల భవనాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ సచివాలయం, రైతు సేవా కేంద్రాల భవన నిర్మాణ పనులు పూర్తిచేసి త్వరలో ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన పనులు ఎప్పటికప్పుడు పూర్తిచేసే విధంగా అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఏవైనా సమస్యలు ఏర్పడితే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆయన వెంట సర్పంచి కుక్కల లక్ష్మి, ఉప సర్పంచి కలిదిండి శ్రీనివాస్‌వర్మ, పాలకోడేరు సొసైటీ మాజీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు, మాజీ సర్పంచి గాదిరాజు సూర్యనారాయణరాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు కమ్మిల రాంబాబు పాల్గొన్నారు.


భవనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు

వశిష్ట వారధి నిర్మించాలి

26, 27 తేదీల్లో నరసాపురంలో సిపిఎం రాష్ట్రస్థాయి సమావేశాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - నరసాపురం

వశిష్ట వారధి నిర్మాణం చేపట్టాలని, ఫిషింగ్ హార్బర్ త్వరితగతిన పూర్తి చేయాలని, కోటిపల్లి, నరసాపురం రైల్వేలైన్ పనులు వేగవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక మీరా గ్రంథాలయంలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బలరాం మాట్లాడారు. ఈ నెల 26, 27 తేదీల్లో నరసాపురంలో సిపిఎం రాష్ట్ర స్థాయి సమావేశాలు జరగనున్నాయని తెలిపారు. ఈ సమావేశాలకు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఆల్ ఇండియా నాయకులు హాజరవుతారన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర కమిటీలో చర్చించి సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. ముఖ్యంగా తీర ప్రాంతం అభివృద్ధికి ముఖద్వారంగా ఉన్నామన్నారు. ప్రభుత్వాలు ఈ ప్రాంతంపై దృష్టి సారించి ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఉభయగోదావరిలో జిల్లాలను అనుసంధానం చేసే వశిష్ట వారిధి నిర్మాణం చేపట్టాలన్నారు. సముద్ర తీరంలో ఫిషింగ్ హార్బర్ పనులను వేగవంతం చేసి త్వరితగతిన హార్బర్ నిర్మాణం చేపట్టాలన్నారు. కోటిపల్లి, నరసాపురం రైల్వేలైన్ వేగంగా పూర్తి చేయాలన్నారు. నరసాపురం టు మచిలీపట్నం రైల్వే లైన్ పనులు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరునెలల పాలనలో తాగనీటి కంటే మద్యానికి ప్రాధాన్యతిస్తూ బెల్టు షాపుల ద్వారా మద్యాన్ని ఏరులై పారిస్తోందని విమర్శించారు. మద్యాన్ని నియంత్రించే చర్యలను ప్రభుత్వం చేపట్టాలన్నారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో అదనపు విద్యుత్ భారాలను ప్రజలపై వేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఈనెల 26, 27 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సమావేశాల్లో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి ప్రజా ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, మండల కమిటీ సభ్యులు తెలగంశెట్టి సత్యనారాయణ, పట్టణ కమిటీ సభ్యులు పొగాకు నారాయణరావు, నోముల కొండ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

డిఆర్ఓ, ఐసిడిఎస్ పీడీకి వినతి

ప్రజాశక్తి - భీమవరం

అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి డిమాండ్ చేశారు. మినిట్స్ కాపీలో అంగీకరించిన వాటిని, జిఒలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ మేరకు కలెక్టరేట్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ పీడీ సుజాతారాణికి అంగన్వాడీలు గురువారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ రాష్ట్రంలో పసి పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు అనేక సేవలందిస్తున్న అంగన్‌వాడీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. రోజుకో యాప్ పేరుతో పనిభారం పెంచుతోందని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెరగడం లేదని తెలిపారు. 2013 డిసెంబర్ 12న సమ్మె చేపట్టారని, 42 రోజుల పాటు సమ్మె కొనసాగిందని ఈ క్రమంలో ప్రభుత్వం హామీలు అమలు చేస్తామని చెప్పిందని తెలిపారు. ఐదేళ్లు గడుస్తున్నా వేతనాల పెంపు మాత్రం జరగలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారంలోకొచ్చిన ప్రభుత్వం వెంటనే మినిట్స్ కాపీ రూపంలో ఉన్న హామీలను, జిఒగా అమలు చేయాలని కోరారు. మెనూ ఛార్జీలు పెంచాలని, ప్రభుత్వం ఉచిత గ్యాస్ పథకం అంగన్వాడీ సెంటర్లో కూడా వర్తించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వినతి పత్రాలు అందించిన వారిలో జిల్లా అధ్యక్షులు కె.ఝాన్సీలక్ష్మి, సహాయ కార్యదర్శులు ఎమ్‌డి హసీనా బేగం, సిహెచ్ రాణి, ఉపాధ్యక్షులు పి.తులసి, జిల్లా కమిటీ సభ్యులు నాగరత్నం, శ్రీదేవి, దుర్గ నళిని పాల్గొన్నారు.


డిఆర్ఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు

గూడెంలో చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

సందడి చేసిన హీరోయిన్ మీనాక్షి చౌదరి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రముఖ సినీనటి, లక్కీ భాస్కర్ సినిమా హీరోయిన్ మీనాక్షి చౌదరి తాడేపల్లిగూడెంలో చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేశారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని జివి మాల్ పక్కన నూతనంగా నిర్మించిన చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ఆమె ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మిరెడ్డి పట్టాభిరామ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడ కొత్తగా వ్యాపారాలు గానీ, ప్రారంభోత్సవాలు గానీ పెట్టలేని పరిస్థితి అని తెలిపారు. రాష్ట్రాన్ని 15 సంవత్సరాలు వెనక్కి గెంటేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైసిపి ప్రభుత్వమేనని ఎంఎల్‌ఎ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో ఇటువంటి మాల్స్ రావడం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఉద్యోగావకాశాలు వస్తాయని తెలిపారు. సినీనటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ చిత్ర పరిశ్రమలో తనను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని తెలిపారు. షాపింగ్ మాల్ వద్ద కేరళ కథాకళి ఇతర సాంప్రదాయ నృత్య రూపకాలను ఏర్పాటు చేశారు. షాపింగ్ మాల్ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు, చెన్నయ్ షాపింగ్ మాల్ యాజమాన్యం జనార్ధన్ రెడ్డి, మర్రి వెంకటరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి ఉలవల బాబ్జి, బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.


షాపింగ్ మాల్‌ను ప్రారంభించి వస్త్రాలను చూపుతున్న హీరోయిన్ మీనాక్షి చౌదరి

విద్యుత్ ఛార్జీల పెంపు దారుణం : వ్యకాస

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీల పేరుతో భారాన్ని మోపడం దారుణమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతి రెడ్డి జార్జి విమర్శించారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి జక్కం శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల ఆరో తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకూ నిర్వహించే రెవెన్యూ సదస్సులు అసైన్డ్ భూముల వివరాలను పంచాయతీ కార్యాలయాల వద్ద పెట్టాలని కోరారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పేదలకు అందించాలని, నిర్మించుకునే ఇళ్లకు రూ.ఐదు లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు, గుబ్బల నాగేశ్వరరావు, పి.మృత్యుంజయ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - కాళ్ల

సాగునీటి సంఘాల ఎన్నికలు ఈనెల 14వ తేదీన జరుగుతాయని కాళ్ల తహశీల్దార్ జి.సుందర్ సింగ్ గురువారం తెలిపారు. ఈమేరకు ఇప్పటికే ఎన్నికలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మండలంలో పెదఅమిరం, కోపల్లె, ఎల్ఎన్ పురం, మాలవానితిప్ప, సీసలి, కాళ్ల, కోలనపల్లి, కాళ్లకూరు, కలవపూడి, బొండాడ సాగునీటి సంఘాలున్నాయి. మండలంలో మొత్తం 10 నీటి సంఘాలకు కలిపి 22,872 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఓటర్లయిన రైతులంతా కలిసి వాటర్ యూజర్స్ అసోసియేషన్(డబ్ల్యుయుఎ) సభ్యులను ఎన్నుకుంటారన్నారు. 10 సాగునీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షుడు, సభ్యులకు సంబంధించి ఆయా గ్రామాల్లో జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాల్లో జరుగుతాయన్నారు.

నరసాపురం : సాగునీటి సంఘాల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని నరసాపురం తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఇప్పటికే ఎన్నికలు జరిగే గ్రామాల్లో టాంటాం వేయించామన్నారు. మండలంలో నాలుగు సంఘాలకు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. రుస్తుంబాద, కొప్పర్రు, వేములదీవి, నరసాపురం సాగునీటి సంఘాల పరిధిలో మొత్తం 16,328 మంది ఓటర్లు ఉన్నారన్నారు. నరసాపురం సంఘంకు టేలర్ హై స్కూల్‌లో, రుస్తుంబాదకు లెనిన్ హైస్కూల్, వేములదీవిలో సర్దుకొడప, కొప్పర్రు నీటి సంఘానికి హైస్కూల్లో ఎన్నికలు జరపనున్నారు. ఉదయం 9 గంటల లోపు ఆ సంఘాల పరిధిలోని రైతులందరూ పోలింగ్ కేంద్రాలకు హాజరుకానున్నారు. ఆ తరువాతే అధ్యక్ష, ఉపాధ్యక్ష, పది మంది డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు. ఈ ఎన్నికలను సజావుగా సాగేందుకు ఎంపిడిఒ, ఎంఇఒ-2, ఇఒపిఆర్‌డి, ఆర్డబ్ల్యుఎస్ ఎఇతో పాటు మరో 32 మంది సిబ్బందిని నియమించామన్నారు.

ఆచంట: మండలంలో ఈనెల 14వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ జి.కనకరాజు విలేకరులకు తెలిపారు. ఆచంట-1 ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఆచంట-2 ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంట కాలువల్లో చెత్తను తొలగించాలి

పెనుగొండ : దాల్వాసాగుకు ఆకుమడులు వేసే సమయంలో నీరు ఇబ్బందులు తప్పటం లేదని రైతులు వాపోతున్నారు. కాలవలకు ఇరువైపులా పూడిక చెత్త తీయడంలో, లాకుల దగ్గర ఎప్పటికప్పుడు చెత్త తొలగించడంలో నీటి ఎద్దడి ముందస్తు చర్యల్లో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో దాల్వా సాగుకు ఆదిలోనే పంట కాలువలు చెత్తను తొలగించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దాల్వా పంటకు ఎక్కువగా నీరు కాలువల ద్వారా సక్రమంగా వస్తేనే దాల్వాపంట సాగు అవుతుందని, లేకపోతే రైతులు కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్ అధికారులు దాల్వాసాగుకు నీరందించాలని రైతులు కోరుకుంటున్నారు. దీనిపై సిద్ధాంతం ఇరిగేషన్ అధికారి ఎఇ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే దేవకాల పనులు మొదలుపెట్టామని, కాలువకు ఇరువైపులా ఆక్రమణకు గురైందన్నారు. కాలువ పూడిక పనులు తీయడంలో పలు అభ్యంతరాలు వెలువడ్డున్నప్పటికీ యంత్రాలతో వెళ్లే మార్గం లేదని చెప్పారు. పలు సమస్యలు ఏర్పడుతున్నాయని, అయినప్పటికీ తొందరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

తాడేపల్లిగూడెం టౌన్ : ఈనెల 20, 21, 22వ తేదీల్లో సిపిఎం 26వ జిల్లా మహాసభ భీమవరం పట్టణంలో జరుగుతుందని, ఈ మహాసభకు రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ నుంచి మొత్తం సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి అన్నారు. తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం యూనియన్ అధ్యక్షులు సత్తి కోదండరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ మహాసభల్లో రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ కార్మికులందరూ పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయి రెడ్డి, ఆడప ఆంజనేయులు, మద్దాల పుత్రయ్య, ఎస్‌విఎస్ రెడ్డి, ఆకుల నారాయణ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి

ఉండి : రాష్ట్ర ప్రభుత్వంచే మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో నిర్వహించబోవు రెండు నెలల ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ వేగేశ్న శ్రీనివాసరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదో తరగతి, ఆ పైన పాసైన వారికి రాష్ట్ర ప్రభుత్వంచే స్కిల్ హబ్ ఇనిషియేటివ్ పథకం ద్వారా రెండు నెలల స్వల్పకాలిక శిక్షణ ఉపాధి అవకాశం కల్పించబడుతుందన్నారు. అర్హులైన వారు పాల్గొని ఉపాధి అవకాశాన్ని మెరుగుపరుచుకోవాలని ఆయన కోరారు. ఈ పథకానికి ఈనెల 21వ తేదీ వరకు గడువు ఉందని, పూర్తి వివరాల కోసం కళాశాలను సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమంతో సుపరిపాలన : ఎంఎల్ఎ

తణుకు : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తణుకు నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి కలిపి రూ.226 కోట్లు అందించామని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన అభివృద్ధిపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, మోదీ సహకారంతో అభివృద్ధి, సంక్షేమంతో పాటు సుపరిపాలన అందించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో అన్ని రకాల వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ఈ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని, జగన్మోహన్‌రెడ్డి చేసిన నిర్వాకాలు ఈ ప్రభుత్వానికి శాపంగా మారాయని, వాటిని అన్నింటిని అధిగమించి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పెన్షన్‌లో అదనంగా రూ.1000 పెంచి ఇవ్వడం జరుగుతుందని, ప్రతీ నెల ఒకటవ తేదీనే అందించడం జరుగుతుందన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం కూడా ఏడాదికి రూ.32 వేల కోట్లు వెచ్చించడం లేదని, అది కూటమి ప్రభుత్వం మాత్రమే అని అన్నారు. అన్న క్యాంటీన్లను నిర్వహణ మూసివేసి పేదల కడుపు కొట్టిన జగన్ ప్రభుత్వం అని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్లు 198 ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తున్నామన్నారు. సంక్రాంతి లోపు రూ.45 వేల కోట్లు పనులు పూర్తి చేస్తామని అన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, వావిలాల సరళాదేవి, బసవ రామకృష్ణ, పితాని మోహన్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ ఆవిష్కరణలో ప్రజలు పాల్గొనాలి : జెసి

భీమవరం : స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణలో జిల్లా ప్రజలు విరివిగా పాల్గొనాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ వేడుకకు చేయవలసిన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 13వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ సభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వెళ్లేందుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా నుంచి బయలుదేరి తిరిగి జిల్లాకు చేరుకునే వరకు పూర్తి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఏ విధమైన పొరపాట్లకు ఎట్టి పరిస్థితుల్లో తావీయరాదన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, సిపిఒ శ్రీనివాసరావు, ఆర్డిఒ దాసిరాజు, ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

'తిరుమల టిక్కెట్లు ఇప్పిస్తానంటూ మోసం'

నేరాలు - ఘోరాలు

నరసాపురం : తిరుమల తిరుపతి దర్శనం టిక్కెట్లు ఇప్పిస్తానంటూ ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తి రూ.37,500 కొట్టేసిన ఘటనపై గురువారం కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి సిఐ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన జి.శ్రీకాంత్ పవన్ రెడ్డి నాయుడు గతనెల 21న ఆన్‌లైన్‌లో శ్రీవారి దర్శనం కోసం ప్రయత్నించాడు. అయితే టిక్కెట్లు దొరకలేదు. కొద్దిసేపటికి అతని ఫోన్ నెంబర్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి కాల్ వచ్చింది. మీరు ప్రయత్నించిన తిరుమల దర్శనం ఇప్పిస్తానని నమ్మబలికాడు. అయితే ఒక్కొక్కరికి రూ.12,500 అవుతుందని నమ్మించాడు. డబ్బులు యూపిఐ ద్వారా పంపండి, టిక్కెట్లు మీ వాట్సప్ నెంబర్‌కు పంపిస్తానన్నాడు. అతని మాటలు నమ్మి వెంటనే శ్రీకాంత్ అతను చెప్పిన నెంబర్‌కు మూడు టిక్కెట్లకు రూ.37,500 గూగుల్ పే చేశాడు. డబ్బు చేరిన మరుక్షణం మోసగాడు ఫోన్ నెంబర్‌ను స్విచ్ఛాఫ్ చేశాడు. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసుల్ని ఆశ్రయించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో చోరీ

నరసాపురం : పట్టణంలోని 28వ వార్డులో గురువారం తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ జయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం బండెల రామారావు ఇంటికి తాళం వేసి గతనెల 17న కుమార్తె ఇంటికి వెళ్లాడు. తిరిగి గురువారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉంది. సామాన్లు చెల్లా చెదురుగా పడి, ఇనపబీరువాలోని కాగితాలు తగలబెట్టి ఉన్నాయి. బెడ్ రూమ్‌లో బీరువాలో దాచిన 30 తులాల వెండి, 28 గ్రాముల బంగారాన్ని అపహరించుకుపోయారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

మండల స్థాయి శిక్షణా తరగతులు ప్రారంభం


కాళ్ల : శిక్షణా తరగతులకు హాజరైన అధికారులు

ప్రజాశక్తి - కాళ్ల

క్షేత్రస్థాయిలో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామపంచాయతీ అధికారులు పనిచేయాలని కాళ్ల ఎంపిడిఒ జి.స్వాతి పేర్కొన్నారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి లక్ష్యాలపై నాలుగు రోజుల మండల స్థాయి శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. రెండు బృందాల వారీగా ఈ శిక్షణా తరగతులు జరుగుతాయి. ఈ సందర్భంగా ఎంపిడిఒ జి.స్వాతి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచుల మధ్య సమిష్టి కృషి ఎంతో అవసరమన్నారు. పేదరిక నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయని గుర్తు చేశారు. పలు పథకాలకు లబ్ధిదారులను గుర్తించి, వారికి ప్రయోజనం చేకూర్చేందుకు గ్రామపంచాయతీలు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పి.ఆంజనేయరాజు, డాక్టర్ సునీత, నిర్మలాదేవి, రవీంద్ర, భాస్కరరావు, కాళ్లకూరు జువ్వలపాలెం, ఏలూరుపాడు 1,2, ప్రాతళ్లమెరక, మాలవానితిప్ప, కలవపూడి పంచాయతీ గ్రామ కార్యదర్శులు డి.సునీల్ రాజు, ఎ.పోలయ్య, ఎస్.అరుణా దేవి, నాగ మోహిని, ఏసుబాబు, సుజాత, సాత్వికం పాల్గొన్నారు.

మొగల్తూరు : గ్రామ పంచాయతీలలో వనరులను సద్వినియోగం చేసి అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సుస్థిరాభివృద్ధి సాధనపై రెండు రోజులు నిర్వహించనున్న శిక్షణా తరగతులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దీనిపై ప్రత్యేక శిక్షణ పొందిన ట్రెయినీలు ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్, ఎంపిహెచ్ఒ మూర్తి, ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి, జగన్నాధపురం పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, మోడీ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుభాకర్‌లు సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

ఆకివీడు : సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయి శ్రద్ధ వహించి, గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిడిఒ సుహాసిని కోరారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన సర్పంచులకు, పంచాయతీ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఈ శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా ముందుగా శిక్షణ పొందిన ఆరుగురు అధికారులు నిర్వహిస్తారన్నారు. వెలుగు ఎపిఎం కృష్ణవేణి, ఎంపిహెచ్ఒ సుబ్బలక్ష్మి, పంచాయతీ హౌసింగ్ ఇంజనీర్ అవితేజ్, పంచాయతీరాజ్ ఇంజనీర్ రమణమ్మ, ఐసిడిఎస్ పిఒలు ఈ శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణ ప్రత్యేకంగా తొమ్మిది లక్ష్యాలతో గ్రామీణ అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వైద్య, ఆరోగ్య అంశాల గురించి అదనంగా పెదకాపురం మండల పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రాజశేఖర్ వివరించారు.


చిన్నారులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కాళ్లకూరులో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామంలో యేసుక్రీస్తు ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ వేడుకలకు పాస్టర్ కె.సురేష్ బాబు అధ్యక్షత వహించారు. ఈ క్రిస్మస్ వేడుకల్లో పాస్టర్ ఆదాం మాట్లాడుతూ కాళ్లకూరు గ్రామంలో పాస్టర్ బివి.అప్పారావు-మరియమ్మల ఆధ్వర్యంలో గత 12 సంవత్సరాల నుంచి క్రిస్మస్ వేడుక నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రిస్మస్ ప్రాముఖ్యత, ఏసుక్రీస్తు బోధనల గురించి సందేశం ఇచ్చారు. పాస్టర్ ఎండి ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రేమ, సామరస్య సందేశాన్ని వ్యాప్తి చేసేందుకు ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారన్నారు. ఈ క్రిస్మస్ వేడుకలకు కాళ్లకూరు, జువ్వలపాలెం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున క్రైస్తవ భక్తులు వచ్చారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా క్రిస్మస్ వేడుకలకు విచ్చేసిన వారికి ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బి.మరియమ్మ, త్రిమూర్తులు, భూపతి, ఏలియా, దానియేలు, షాలేం, మోహన్ రావు, అశోక్, రత్నరాజు, బి.మురళీ, నరేష్ పాల్గొన్నారు.

ఆయాలకు జీతాలివ్వాలని వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

అష్ట కష్టాలు పడి అరకొర జీతాలతో ప్రభుత్వ పాఠశాలల్లో(ఆయాలు)గా విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ వర్కర్స్‌కు జీతాలు ఎప్పుడు అందుతాయో తెలియక అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల వేతనాలు మంజూరు చేశామని చెబుతున్నా అంగట్లో అన్నీ ఉన్నా! అల్లుడి నోట్లో శని అన్న చందంగా ప్రభుత్వ వైఖరి ఉందని సిఐటియు మండల కార్యదర్శి ఆవుల శ్రీనివాస్ విమర్శించారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ బి.అనిత కుమార్‌కి, మండల విద్యాశాఖ అధికారి-2 రామకృష్ణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జూన్ వరకు జీతాలు ఇచ్చిన ప్రభుత్వం జూలై నెల నుంచి నవంబర్ వరకు నేటికీ ఐదు నెలల వేతనాలు చెల్లించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వేతనాలపైనే జీవనాధారం సాగిస్తున్న అనేక కుటుంబాలకు ఇవే ఆధారం. గౌరవ వేతనం పేరుతో రూ.6 వేలు ఇచ్చి బండెడు చాకిరీ చేయిస్తున్న ప్రభుత్వం కనీస వేతనంగా రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణం వేతన బకాయిలు చెల్లించి, కనీస వేతనం అమలు చేయకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల శానిటేషన్ వర్కర్స్ పాల్గొన్నారు.

మహిళలను వ్యాపారవేత్తలు చేయాలి

నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య

నరసాపురం: మహిళలను వ్యాపారవేత్తలుగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందికి నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. నరసాపురం మెప్మా ఆఫీసులో గురువారం మెప్మా అధికారులు డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘం మహిళలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులను ప్రతిచోటా అమ్మకాలు చేయాలన్నారు. డ్వాక్రా సంఘాలను నెలకొల్పి, మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించి, చేయూత అందించాలని సిబ్బందిని ఆదేశించారు. సిహెచ్.మోహన్, సిఎంఎం ఎంవివి.సత్యనారాయణ, సిఒఆర్.షణ్ముఖ దేవి పాల్గొన్నారు.

వరి సస్యరక్షణలో మార్గదర్శకాలు

మార్టేరు ఫారంలో వర్క్ షాప్

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో వరి పంట సస్య రక్షణలో మార్గదర్శకాలు అనే అంశంపై గురువారం ఒక రోజు వర్క్ షాప్ జరిగింది. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, డాక్టర్ టి.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, పరిశోధన ప్రతినిధి మధు మంజరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వరి పంటను ఆశించే 18 రకాల పురుగులు, తెగుళ్లపై ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండే విధంగా రూపొందించిన సస్యరక్షణా సిఫారసులను మన శాస్త్రవేత్తలు పూర్తిగా పరిశీలించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అనువుగా ఉండే విధంగా మార్పులు, చేర్పులు చేయాలని, అంతేకాక వీటిని తెలుగు భాషలోకి అనువదించడానికి ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మధు మంజరి మాట్లాడుతూ గత నెల 13వ తేదీన ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, కాబి ఇంటర్నేషనల్ వారి మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మంచి నాణ్యత కలిగిన చిత్రాలు, సమాచారం అంతా 'కాబి ప్లాంట్ వైస్ ప్లస్ అనే యాప్'లో నిక్షిప్తం చేసామని, ఈ సమాచారాన్ని మొబైల్ ఫోన్ ద్వారా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎంవి.కృష్ణాజి, ప్రధాన శాస్త్రవేత్త విస్తరణ విభాగం వారు సమన్వయ కర్తగా వ్యవహరించి కార్యక్రమాన్ని ముదుకు నడిపారు.

'ధాన్యం తూకాల్లో మోసాలు అరికట్టాలి'

అత్తిలి : ధాన్యం తూకాల్లో మోసాలను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలులో ఎదురౌతున్న సమస్యలపై ఆయన అత్తిలి మండలంలోని ఈడూరు, కొమ్మర, పాలూరు, అత్తిలి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు తూకాల్లో మోసాలను అరికడతున్నామని, గోనె సంచులు అందిస్తున్నామని చెబుతున్నా ఆచరణలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. మూడు గ్రామాల్లో ధాన్యం తూకాలు పరిశీలించగా ప్రతీ చోట సంచి బరువుకి 600 గ్రాములు అదనంగా తూస్తున్నారని అన్నారు. ఈ సమస్యపై జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్, వ్యవసాయ శాఖ మండల ఎఒ దృష్టికి తీసుకెళ్లగా ధాన్యం తూకాల్లో అదనంగా తూసిన ధాన్యం రైతులకు కలిపి ట్రక్ సీటు ఇస్తామని, గోనెసంచులు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌలురైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు


నరసాపురం తహశీల్దార్ రాజరాజేశ్వరి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలో ఈ నెల 13వ తేదీ నుంచి 2025 జనవరి 3 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. 13న నవరసపురం, 17న కొప్పర్రు, 18న లక్ష్మణేశ్వరం, 19న లక్ష్మణేశ్వరం, 20న ఎల్బిచర్ల, 21న వేములదీవి, 24న నరసాపురం, 26న తూర్పుతాళ్లు, 27 గొంది చిట్టవరం, 28న మల్లవరం, మాధవాయిపాలెం, 30న సరిపల్లి, లిఖితపూడి, 31న చినమామిడిపల్లి, కె.బేతపూడి, జనవరి 2న సీతారాంపురం, 3న రుస్తుంబాద గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పంచాయతీ కార్యాలయాల వద్ద సదస్సులు ఉంటాయన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రాజరాజేశ్వరి కోరారు.


ఆచంట : రైతుల భూములకు సంబంధించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 13వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరిగే రెవెన్యూ సదస్సులను జయప్రదం చేయాలని తహశీల్దార్ జి.కనకరాజు గురువారం తెలిపారు. గ్రామస్థాయిలో ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే ఈ సదస్సులో భూములకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 13వ తేదీ పెదమల్లం, 16న కోడేరు, 17న ఆచంట వేమవరం, 18న వల్లూరు, 19న అయోధ్య లంక, 20న భీమలాపురం, 20, 21న ఆచంట, శేషమ్మ చెరువు, 23న కరుగోరుమిల్లి, కందరవల్లి, 24న పెనుమంచిలి, 26న కొడమంచిలి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

తణుకు రూరల్ : రైతులు అడంగళ కరెక్షన్, మ్యుటేషన్, జిరాయితీ భూముల నమోదు వంటి సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13 నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తణుకు తహశీల్దార్ డివివిఎస్.అశోక్ వర్మ తెలిపారు. రైతులు పూర్తి డాక్యుమెంట్లతో హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

రాంబాబుపై పలువురు ఫిర్యాదు

సమాచార హక్కు చట్టం దుర్వినియోగం చేస్తే చర్యలు

ఆర్‌టిఐ కమిషనర్ సునీల్ కుమార్


సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న పాలకోడేరు సర్పంచులు

ప్రజాశక్తి - భీమవరం

సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగానికి పాల్పడుతున్న సంకెళ్ల రాంబాబుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం(ఆర్‌టిఐ) కమిషనర్ చావలి సునీల్ కుమార్‌కు పాలకోడేరు మండల సర్పంచులు గురువారం ఫిర్యాదు చేశారు. విజయవాడ ఆర్‌టిఐ కార్యాలయంలో శృంగవృక్షం, వీసాకోడేరు, పాలకోడేరు, వెంద్ర, గొరగనముడి సర్పంచులు జంగం సూరిబాబు, బొల్లా శ్రీనివాస్, ఇంజేటి మరియమ్మ, లక్ష్మీపతి, కడలి నాగేశ్వరి వీరబాబు, గొట్టుముక్కల వెంకట శివరామరాజు(శివాజీ రాజు), మాజీ సర్పంచి చల్లబోయిన పాపారావులు కలిసి సంకెళ్ల రాంబాబుకు సంబంధించిన కేసులు, సమాచార హక్కు దరఖాస్తుల వివరాలను కమిషనర్ సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఇదే విషయాన్ని రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘు రామకృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని సర్పంచులు వివరించారు. మూడు జిల్లాల్లో సుమారు 200 దరఖాస్తులు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసి, పంచాయతీల వద్ద సమాచారాన్ని తీసుకుని, సర్పంచులను బెదిరించి, డబ్బులు డిమాండ్ చేస్తున్నాడన్నారు. ఇవ్వలేని పక్షంలో ప్రసార మాధ్యమాల్లో పోస్ట్ చేయడమే కాకుండా తన అనుచరులతో పోస్టులను ఇతర గ్రూపుల్లో షేర్ చేస్తున్నారని ఆరోపించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో సంకెళ్ల రాంబాబుపై సుమారు 13 కేసులు కూడా నమోదయ్యాయని వివరించారు. సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆర్‌టిఐ కమిషనర్ సునీల్ కుమార్ హామీ ఇచ్చారని సర్పంచులు తెలిపారు.

శాసనమండలి ఛైర్మన్‌ను కలిసిన ఎంఎల్‌సి గోపీమూర్తి


మోషేన్ రాజుకు మొక్క అందిస్తున్న గోపీమూర్తి

భీమవరం : భీమవరంలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజును ఎంఎల్‌సి గోపీమూర్తి గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఎంఎల్‌సిగా గోపీమూర్తి విజయం సాధించి, తర్వాత మొదటిసారిగా శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజును కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌సి గోపీమూర్తి మోషేన్ రాజుకు మొక్క అందజేశారు. మోషేన్ రాజు గోపీమూర్తిని అభినందించారు. అనంతరం శాసనమండలిలో జరిగే వివిధ అంశాలపై చర్చించారు. గోపీమూర్తి వెంట యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, యుటిఎఫ్ నేతలు ఉన్నారు.

14 నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

భీమవరం : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20 వరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఆలపాటి రఘునాథ్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ పొదుపు అవగాహనా ర్యాలీలు జిల్లా ప్రధాన కేంద్రంతో పాటు డివిజన్ కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. 'విద్యుత్ పొదుపు ఆవశ్యకత నూతన సాంకేతిక విజ్ఞానము' అనే అంశంపై వర్క్‌షాపులు నిర్వహిస్తారన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు ఈనెల 20న బహుమతుల ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు.

బిసి హాస్టల్‌కు వెట్ గ్రైండర్ బహూకరణ

తణుకు : తణుకు-ఇరగవరం రోడ్డులో ఉన్న బిసి బాలికల హాస్టల్ విద్యార్థినుల అవసరార్థం రూ.9 వేలు విలువగల వెట్ గ్రైండర్‌ను తణుకు రోటరీ క్లబ్ ద్వారా హాస్టల్ మేట్రిన్ మన్నే రవీంద్రభారతికి అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రభారతి మాట్లాడుతూ విద్యార్థినులకు ఈ గ్రైండర్ ఎంతగానో ఉపయోగపడుతుందని, రోటరీ క్లబ్ వారికి అభినందనలు తెలియజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు ఆనందం మస్తాన్‌రావు, కార్యదర్శి సిద్ధార్ధ, గమిని రాంబాబు పాల్గొన్నారు.